డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన పద్మచరణబాబు ఈ మధ్యే రిటైరయారు. ఇవాళ ఆయన తమ పల్లెకి బయల్దేరారు. దీర్ఘ కాలంగా అంటే గత ముప్పైఅయిదేళ్ళబట్టీ ఆయనకీ, వాళ్ళ పల్లెటూరికి ఏం సంబంధం లేదని చెప్పొచ్చు. అలా అని ఆయన వాళ్ళ ఊరికి మధ్య మధ్యలో వెళ్ళ లేదని కాదు.

అయితే ఆ వెళ్ళటం వెళ్ళకపోవటం రెండూ సమానమే। చుట్టంలా వెళ్ళి ఓ రోజో ఓ పూటో వుండటం, సోదరులవో, జ్ఞాతులవో, మేనల్లుళ్ళవో పెళ్ళిళ్ళకి పేరంటాలకి మొహం చూపెట్టి వస్తున్నారు. పెళ్ళాం పిల్లలతో కుటుంబ సమేతంగా వెళ్ళడం చాలా అరుదు.

వాళ్ళ ఊళ్ళో ఎక్కడికి వెళ్ళడానికిగాని. ఎవరింటికైనా వెళ్ళడానికిగాని. మనస్సువిప్పి మాట్లాడానికిగాని సమయమూ వుండేదికాదు. వీలూ అవకాశం చిక్కేవికావు.ఏదో పై పై పలకరింపులే. వెళ్ళడమూ రావడమూను।।

సబ్ డిప్యూటీ కలెక్టర్‌గా రాజధాని నగరం భువనేశ్వరంలో వున్నప్పుడు అదీ ఐదారేళ్ల క్రితం ఓసారో రెండుసార్లో వాళ్ళ పల్లెకి వెళ్ళారు. కొన్ని గంటలు మాత్రమే వున్నారు. ఆఫీసు పనికోసం వెంటనే తిరిగి వచ్చేసారు. ఇటు ఆఫీసు పనీ అలాంటిదే.దానికితోడు ఆ పల్లెటూళ్ళో వుండడానిక ఇల్లూలేదు! ఇన్నేళ్లయింది. తాను వుండడానికి యోగ్యమైన ఇల్లొకటి ఆ ఊళ్ళో ఆయన కట్టించుకోలేకపోయేరు. ఇంటి జాగా తన వొంతు కొచ్చింది. అలాగే పడివుంది : ఎటుచూసినా బలుసు తుప్పలు. దురదగొండి మొక్కలు. పూచికలూను: మొలవకేం చేస్తాయి : అలా వదిలేసినప్పుడు?: ఈ రోజుల్లో ఇల్లు కట్టించడం ఏం మాటలా? అందులోనూ ఇటూ అటూ దక్షతలేని తనలాంటి వాడికి!! తాను ఒక్కడూ ఎన్నిటికని ఎక్కడికని పరిగెడతాడు: అందుకే ఆయన అలాంటి ఆశ ఏం పెట్టుకోలేదు. ఎప్పుడైనా దేనికైనా వాళ్ళ ఊరు వెళ్తే అన్నదమ్ముల ఇంట్లో ఓరోజో ఓపూటో వుండడం-ఎంత తొందరగా బయల్దేర గలిగితే అంత తొందరగా తిరిగి వచ్చేయడం. అదీ ఆయన చేసినది!

ఆయన కొన్నాళ్ళు గ్రామాభ్యుదయ శాఖలో వున్నారు. చదువుకునీ ఉద్యోగం లేక తిరుగుతున్న యువకులకి ఆయన ఆ రోజుల్లో ఉపదేశాలు యిచ్చేవారు "పల్లెలకి వెళ్ళండి" అని ప్రబోధించేవారు. "పల్లెలు పిలుస్తున్నాయి!" "పదండి పల్లెలకి!" ఇలా ఎన్నెన్నో మంచి మంచి స్లోగన్లతో పెద్ద పెద్ద పోస్టర్లు రాయించేవారు. నాలుగువేపులా గోడలకి అంటింపించేవారు. ఆ శాఖ మంత్రిగారితో కలిసి జీపులో వెళ్తున్నప్పుడు పల్లెటూళ్ళ గొప్పతనం గురించి. సంస్కృతి గురించి ఎన్నెన్నో కొత్త అంశాలను ఎంతగానో ఉద్ఘాటించి చెప్పేవారు. అయితే ఆయనకీ పల్లెటూరికి మధ్య వున్న సంబంధం నోటి మాటల వరకే మిగిలింది!!

దగ్గర్లోఉన్న టౌనులో బస్సుదిగి దగ్గర దగ్గర మరో నాలుగు మైళ్ళ దూరం రిక్షాలో వెళ్తే వాళ్ళ పల్లెటూరు వస్తుంది. వర్షాకాలంగాని అయిందా. ఓ మైలు దూరం కాలినడకని వెళ్ళాల్సిందే। సంజె పొద్దు వాలిపోయింది. తోవలో బస్సు అరగంటకి పైన లేటయిపోయింది. బస్సు కండక్టరు ఓ ప్రయాణీకుడుతో శలేయి దగ్గర లగేజీ విషయంలో పేచీ పెట్టాడు. కొంత మంది ప్రయాణీకులు బస్సుదిగిన ప్రయాణీకుణ్ణి సమర్ధించారు. దాంతో జట్టీ మరీ పెద్దదయింది. పద్మ చరణబాబు టౌనులో దిగి రిక్షా ఎక్కారు.

"అమ్మయ్య ఇహ ఎలాగో ఓలాగ గ్రామం చేరుకోవచ్చు" అని ఆయన అనుకున్నారు. "తొందరగా తొక్కు" రిక్షా వాడితో ఆయన అన్నారు.

టౌను ఇంకా దాటలేదు- తోవలో ఆయన సోదరుడి ఇంట్లో పని చేసే రైతు నటియా టౌనులో ఏవో సామాన్లు కొనుక్కుని వస్తూ కనపడ్డాడు. పద్మచరణ బాబుని చూసి దణ్ణం పెట్టేడు.

"పదమ బుగత గోరేనా? దండాలండి!" అన్నాడు.

"మా ఇంట్లో అంతా బావున్నారా?" పదబాబు అడిగారు.


"మా ఇంట్లో" అన్న మాట నోట ఉచ్ఛరిస్తున్నప్పుడు ఆ మాట ఆయన చెవికే అతి అవాస్తవంగా వినిపించింది!

"ఆయ! బావున్నారండీ! తమరు వెళ్ళండి. బుగతగోరు దినుసులు తెమ్మని పురమాయించినారు నాకు. తమరి ఎనకాతలే వస్తానండి!" అన్నాడు నటియా.

రిక్షా ఇంకా స్త దూరం వెళ్ళేక పైరుకోసి పంటని బండిలో తోలుకు వెళ్తూ రామ గౌడు కనిపించాడు. అయితే వాణ్ణి ఆయన వెంటనే పోల్చుకోలేకపోయేరు మంచి వయస్సులో ఉండగా చూసిన రామ గౌడు ఇప్పుడు వండు ముసలి! పళ్లూడిపోయాయి. పద బాబు రిక్షాలోంచి తొంగి చూసేరు.


"ఏరా! రామాయేనా?" అని అడిగేరు. అయితే అప్పటికి రామా రెండెద్దుల తోకల మీద చెయ్యిపెట్టి వాటిని కటువుగా బూతులు తిట్టడం మొదలు పెట్టేడు. వాడికి పదబాబు మాట వినిపించకపోయేనా ఉండాలి!!లేదా వినిపించీ ఆయన్ని పోల్చుకోలేకపోయేనా ఉండాలి!!ఈరామాగౌడ, రామలీలలపుడు మంధరగానూ, శూర్పణఖగానూ వేషం కట్టేవాడు! పదబాబుకా సంగతి జ్ఞాపకం వచ్చింది. కర్రతోచేసిన శూర్పణఖ మొహాన్ని పెట్టుకుని నృత్యపు చిందులు తొక్కుతూ వాడు వచ్చేసరికి ప్రేక్షకులంతా కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వేవారు.

పదబాబుకి విచారం కలిగింది. తను కాలేజీ చదువుతున్న రోజుల్లో. తన తండ్రి బతికున్నప్పుడు సెలవలకి ఊరు వస్తు



న్నట్టు తన ఉత్తరం వెళ్ళటం చాలు బండి పంపించేవారు. బస్సు స్టాండు నుంచి తిన్నగా ఇంటికి బండిలో వెళ్ళేవారు.

దీర్ఘకాలంగా, అదే గత ముప్పై. ముప్పై అయిదేళ్ళబట్టీ ఆయన ఊరికి దూరమై పోయేరని చెప్పాలి. అంతా మారి పోయింది. రోడ్డుతోవ ఎంతో బాగుపడ్డాది. ఓ మైలు దూరం మాత్రం ఇంకా మట్టితోనేవుంది. కాలువమీద వంతెనా రాలేదు. ఓసారి మంత్రిగారిని తీసుకొచ్చి తిప్పితే అదీ అయేది. అయితే ఊళ్ళోజనం ఆ మాత్రమైనా తమ బాగుకోసం పని చేయించుకోలేక పోతున్నారు. వాళ్ళలో వాళ్ళు జట్టీ లాడ్డంలోనూ.




# కోతి

ఒరియా మూలం:
శ్రీ సచ్చిరౌతరాయ్
తెలుగుసేత: చాగంటి తులసి

పేచీలు పడ్డంలోనూ వాళ్ళకి రోజులు గడిచిపోతాయి. ఊరి గురించి ఆలోచించే దెవరు??

రిటైరయేక ఊళ్ళో ఓ చిన్న ఇల్లు కట్టుకుందామనీ, కుటుంబంతో అక్కడే వుందామని ఎన్నోసార్లు ఆయన అనుకున్నారు. గవర్నమెంటు లోను తీసుకుని కట్టిన ఇల్లు రాజధానీ నగరంలోవుంది. దాన్ని అద్దెకి యిచ్చేస్తాం అనుకున్నారు. తర్వా తర్వాత ఈ వూహా ఆలోచనా చప్పబడిపోయాయి. పల్లెటూరికి వెళ్ళి ఉంటే ఎలా కుదుపతుంది? పిల్లా పాపతో రోజూ ఎలా గడుస్తుంది? తాత తండ్రుల నుంచి సంక్రమించిన పొలం తగ్గి తగ్గి చివరికిప్పుడు నాలుగు ఎకరాలు మాత్రం ఉంది. దాని పంట తన చేతికొచ్చేధాన్యంతో రెణ్నెళ్ళు కూడా గడవ్వు: పోనీ అని ఆ వచ్చేది నికరంగ ఎప్పుడు వస్తుందా? ఎప్పుడు ఏమవుతుందో వాటాదారు రైతులు మీదొచ్చి ఎప్పుడు పడతారో ఎవరికి తెలుసు? వాళ్ళని దెబ్బ తీయటం కలలోమాట: ఊళ్ళో అరడజనుకు పైగా కుర్రాళ్ళు కమ్యూనిస్టులయ్యేరన్న కబురూ ఆయన చెవిని పడ్డది. ఎప్పుడు ఎలా ఉంటుందో ఏమవుతుందో ఎవరు చెప్పగలరు? అంతేనా. ఈ మధ్య ఊరి జనం ధాన్యాన్ని, బియ్యాన్ని కూడా ఊరవతలకి వెళ్ళనివ్వటం లేదు. బస్సులు ఆపేస్తున్నారు. తనకా పిల్లల చదువులైనా పూర్తి కాలేదు. పెద్ద




వాడు ఈ సంవత్సరం బియ్యే అయ్యాడు. వెళ్ళి రూర్కెలాలో ఇంజనీరింగులో చేరాడు. మిగిలిన కొడుకులు నలుగురూ, కూతుళ్ళిద్దరూ స్కూలుకి, కాలేజీకి ఇంకా వెళ్తున్నారు. రాజధాని నగరంలో ఉండక తప్పదు: ఇంకో దారి ఏముంది కనక??

ఆలోచించి ఆలోచించి పద్మచరణ్ బాబు ఊళ్ళో ఉన్న నాలుగు ఎకరాల భూమిని అమ్మేద్దామని నిశ్చయించుకున్నారు. 'భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో భువనేశ్వరం ఇంటి ఆతాలో ఉన్న ఖాళీ స్థలంలో రోడ్డుకి ఆనించి రెండో మూడో గదులు దుకాణాల కోసం కట్టిద్దాం' అనుకున్నారు. అద్దె కనీసపక్షం నెలకో నూటఏభై రెండొందల వరకూ వస్తుంది. తన పెన్షనూ ఆ డబ్బూ కలిస్తే ఏదో బండి బాగానే నడుస్తుంది! తీర్చాల్సిన గవర్నమెంటు "లోను" నెమ్మదిగా తీర్చుకోవచ్చు:

నడిం సోదరుడు బైరోచనుడికి ముందస్తుగా ఉత్తరంరాసి కొనేవాళ్ళని ఖాయపర్చమని, భూమి అమ్మేయడానికి తాను వస్తున్నానని ఆయన తెలియచేసేరు. ఊరు దగ్గర పడ్డాది. ఊరు మొగదల్లో ఉన్న పెద్ద చెరువు కనపడుతోంది. ఈ చెరువులో దిగి ఆయన తన చిన్నప్పుడు ఎన్ని తామర పువ్వులు కోసేరో! ఊళ్ళో మిగతా వీధుల పిల్లలు నిద్రలేవకముందే ఆయనా, ఆయన కడగొట్టు తమ్ముడు త్రిలోచనూ (వాడిప్పుడు బలి మెలాలో కంట్రాక్టరుగా ఉన్నాడు. వాణ్ణి చూసి దగ్గర దగ్గర పదేళ్ళయిపోయింది.) తెల్లవారు ఝామునే లేచి చెరువుకి వెళ్ళేవారు. తామర పువ్వులు భుజాన్ని వేసుకుని వచ్చేవారు! ఖాలూకుణీ (ఖాలుకుణీ ఉసా: భాద్రపద మాసం ఆదివారాల్లో అన్నదమ్ముల కోసం ఆడపిల్లలు పట్టే నోము) నోముకోసమని మరువా అక్కకి ఆ పువ్వులన్నీ యిచ్చేవారు. మిగతా వీధుల పిల్లలు వచ్చి చూస్తే చెరువు పూర్తిగా ఖాలీగా కనపడేది! అన్నదమ్ములిద్దరూ అదును చూసుకుని చెరువులో పువ్వులన్నిటినీ కోసెయ్యాలని తాపత్రయపడుతూ ఉండేవారు!

తను కటకంలో కాలేజీ చదువులో వుండగానే అమ్మా నాన్న ఇద్దరూ పోయేరు! తర్వాత తన ఉద్యోగం- తనూ అయిపోయేరు! గ్రామంతో వున్న ఒకే ఒకలింకు ఇదిగో ఈ నాలుగెకరాల పొలం! దాన్నీ అమ్మేయడానికి ఇవాళ వచ్చేరు. ఇహ మీదట ఈ గ్రామంలో ఆయనకి ఏం వుంటుంది? గ్రామానికి ఆయనో దూరపు చుట్టం! అంతే! మొగలి దొంకల్లోంచి పారుతున్న కేతకికొండగెడ్డ పాము కుబుసంలాగ జిగజిగలాడుతోంది. అక్కడే వున్న పొడుగు తాటి మీంచి కాస్సేపటికి చందమామ పైకి లేస్తాడు! కొండగెడ్డ ఒడ్డున — అదుగో అదే ఆయన భూమీ కనపడుతోంది!!

ఊళ్లోకి వచ్చేసేరు. మధ్యతోవలో సపనీ అమ్మ ఇల్లు. సపనీ అమ్మ అంటే వాళ్ళ తండ్రి వుంచుకున్నావిడ! ఆవిడకో ఇల్లు కట్టించి ఆయన ఆవిణ్ణి అక్కడ పెట్టేడు. దీన్నించి తల్లీ తండ్రీ మధ్య జట్టీలు జగడాలు-అలకలు-మొత్తుకోళ్ళు! తన చిన్నతనంలో ఆయన అవన్నీ చూసేరు! సపనీ చచ్చిపోయింది. ఎన్నేళ్ళయిందో! ఆ ఇల్లూ కూలిపోతోంది. రాళ్ళూ రాటలూ ఇంకా కొన్ని నిలిచి వున్నాయి! ఆయన అతోవంట ఎప్పుడన్నా వెళ్తే సపనీ అమ్మ ఆయన్ని లోపలికి పిల్చేది. జాంపళ్ళు, కొబ్బరిముక్కలు, చెరుకుముక్కలు ఎన్నో పెట్టేదని పదబాబుకి జ్ఞాపకం వచ్చింది. ఆప్యాయతతో ఆయన తల నిమిరేది. అయితే ఆయనెప్పుడూ ఇంటికెళ్ళి ఈ సంగతి చెప్పేవారు కాదు. అమ్మకిగాని తెలిసిందంటే ఏమన్నా వుందా? ఆవిడకి బ్రహ్మాండమంత కోపం వస్తుందని ఆయనకి అనిపించేది.

సోదరుడింటికి ఆయన చేరుకున్నాడు. బైరోచనబాబు ఆ ఊళ్ళో అప్పరు ప్రైమరీ స్కూలు టీచరు. ఆయనో కుర్చీ తెచ్చి వీధి గదిలో వేసేరు. పద్మచరణబాబు కూచున్నారు! అమీను మురారీ మిశ్రకి కబురు పెట్టేననీ, ఆయన రేపు పది గంటలకి ఏకంగా స్థలం దగ్గరికే వస్తారనీ, కొనే ఆయన ఫకీరు సాహూ కూడా వస్తాడనీ, కొలతలూ గట్రా అయిపోయేక మధ్యాహ్నం రెండు గంటలకల్లా వెళ్ళి రిజిస్ట్రీ చేయిస్తారనీ, ఇచ్చి పుచ్చుకోడం గురించి బేరం ముందే కుదిరిందని, రాత కోతలకి స్టాంపులు వేసే జటి కానగోయికి భూమి నెంబరూ గట్రా యిచ్చివచ్చేనని ఆయన చెప్పేరు. స్టాంపు కాగితాలు వెంటనే దొరుకుతాయని, అంచేత ఇవాళింకేల గొడవ పడక్కర్లేదని కాళ్ళూ చేతులు కడుక్కుని భోంచేసి విశ్రాంతి తీసుకోవచ్చని చెప్పేరు.


"మొదట కొనే ఆసామీ ఫకీరుసాహూ మీ అన్నగారు రిజిస్ట్రీ ఖర్చులు సగం పెట్టుకోవాలని పంతం పట్టేడు. అయితే నచ్చచెప్పగా నచ్చచెప్పగా నా మాటకి కాస్త దిగి పావు వొంతు ఖర్చుకి ఒప్పుకున్నాడు. వొంతుదారు రైతులు రెండణాల వొంతు తీసుకుంటామన్నారు" రహస్యం చెప్తున్నట్టుగా ఎంతో నెమ్మదిగా బైరోచనబాబు చెప్పేరు. "సరే మంచిది. అలాగే కానిద్దాం." అన్నారు పద్మచరణబాబు.

మర్నాడు పొద్దున్న పదింటికల్లానాలుగు మెతుకులుతినిపద్మ

చరణబాబుభూమి కాయితాల కట్టపట్టుకుని స్థలం దగ్గరికి వెళ్ళేడు. ఆయనతోపాటువొంతుదారు రైతుకౌలువా కూడావెళ్ళేడు. వాళ్ళని స్థలం దగ్గరికి పంపించి బైరోచనబాబు తన స్కూటరుకితను వెళ్ళిపోయేడు. తీరా చూస్తే అమీను మురారి అతాపతాలేడు. ఆయన కోసం చూసి చూసి పదకొండయింది. అమీనును పిల్చుకు రమ్మనమని కేలూని పద్మచరణబాబు పంపించేరు. ఓ అరగంటకి కేలూ ఒక్కడే తిరిగివచ్చేడు.

"అయ్యా మిశ్రాగారు ఇంట్లోలేరు. పెరుగటుకులు తిని పక్కగ్రామం 'తరాబోయి'కి వెళ్ళిపోయేరు. ఆ ఊళ్ళో ఇవాళ వరినందొ తద్దినంట. నందొ కొడుకులు బ్రాహ్మలకి భోజనాలు పెడుతున్నారట. మిశ్ర ఏనాటి నుంచో వారింట బోక. వెళ్ళక పోతే ఎలా? పొద్దువాలకుండానే తిన్నగా స్థలం దగ్గరికే వచ్చేస్తానని చెప్పమని ఇంట్లో చెప్పి వెళ్ళేరుట!"

పదబాబు కోపంతో మండిపోతున్నారు. అయినా చేసేది ఏం లేక పొలం గట్టునున్న మామిడి చెట్టు నీడలో కూచున్నారు. శీతాకాలపు ఎండ! ఈ ఫాల్గుణ మాసంలోనే స్థలం అమ్మాలి. లేపోతే వొంతుదారు రైతులు వరి నాటేస్తారు. మళ్ళీ సంవత్సరం పాటు ఊరుకోవల్సి వస్తుంది. వరి కోతలయ్యే వరకూ! కొనే ఆసామీ ఫకీర్ సాహూ వచ్చేడు. ఆయనా ఆ చెట్టుకిందే పదబాబు పక్కనే చతికిల్లాపడి అమీను కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాడు.




ఇద్దరూ ఈ మాటా ఆ మాటా మాట్లాడుతూ ఉంటే పదబాబుకి కళ్ళు మూతలుపడ్డం మొదలెట్టేయి. దాంతో ఆయన తువ్వాలు పరుచుకుని ఎడం చెయ్యి మీద తలపెట్టుకుని కాస్త నడుం వాల్చేరు. మరి కాస్సేపయేక ఫకీరుసాహూ, కేలు ఆలకి కూడా కోడికునుకు పట్టేసింది.

ఉన్నట్టుండి పదబాబుకి ఆ చెట్టు మీద ఓ కొమ్మ మీంచి మరో కొమ్మ మీదికి ఓ పెద్ద కోతి చెంగు చెంగు మని దూకుతున్నట్టుగా అనిపించింది. చెట్టు యావత్తునీ ఊపేస్తూ ఒకటే దూకుతోంది. కొమ్మ కాస్తా విరిగి తన మీదగాని పడుతుందో ఏమిటో అనుకున్నారు ఆయన. నిద్రమత్తు కళ్ళతో లేచి కూచుని "కేలూ" అని పెద్దగా బొబ్బపెట్టేరు. కేలూ లేచి కూచున్నాడు

"చూసేవా ఆ కోతి ఎలా వీరావేశంతో చెంగు చెంగు మని దూకుతోందో! ఆ కొమ్మ కాస్తా విరిగి నా మీద పడుతుందను కున్నాను" అన్నారు.

కేలూ నిల్చుని తల పైకెత్తి నాలుగు పక్కలా తేరిపార అదేపనిగా చూసేడు.

"ఏదీ? కోతీ గీతీ ఎక్కడా ఏం లేందే! చెట్టు చిటారి కొమ్మని కొంగ జంటొకటి మాత్రం వుంది! కోతి చెట్టుని ఊపి పారేస్తూవుంటే ఆ రెండూ అలా ఎలా కూచుని వుంటాయి?" అన్నాడు.


# తలనొప్పి లెన్నెన్నో



# చికిత్స ఒకటి!

# అనాసిన్

## దీన్లో బాధనివారణశక్తి ఎక్కువగా ఉంది

వెంటనే ఉపశమనం యివ్వడం కోసం అనాసిన్‌లో, ప్రపంచమంతటా డాక్టర్లు ఎక్కువగా సిఫార్సు చేసే బాధానివారక ఔషధాలు మరింత ఎక్కువగా ఉన్నాయి.

తలనొప్పి, జలుబు, పడిశెం, ఫ్లూ, నడుం నొప్పి, కండరాల నొప్పి, పంటి నొప్పి, వీటికోసం చాలా బాగా పనిచేస్తుంది.

కేవలం అనాసిన్ పైనే విశ్వాసం ఉంచండి.

ఇప్పుడు సురక్షితమైన ఫాయిల్ ప్యాకింగ్‌లో.




శక్తివంతమైన మరియు విశ్వసనీయమైన
మేనర్స్
అనాసిన్*

భారతదేశపు నం. 1 నొప్పిని నివారించే ఔషధం

* Licensed user of T.M.: Geoffrey Manners & Co. Ltd. GM-1-84 TL

ఫకీరు సాహూ కూడా లేచేడు. ఆయనా కేలూ మాటకి వత్తాసు పలికేడు.

"ఏదీ కోతి? మీరు కలకని వుంటారు పదబాబూ!"


"ఏం కాదు. కోతి నిజంగా వచ్చింది. నే చూస్తే. ఎక్కడికి వెళ్ళిపోయిందో ఏమో" అన్నారు పదబాబు.

ఒంటిగంటవుతూ వుంటే అమీను మురారి మిశ్రా వచ్చేడు. గొలుసులు వేసి స్థలాన్ని కొలిచేడు.

"నాలుగుపక్కలా నాలుగు కొయ్యరాటలు పాద్దాం. మరే తగవూ తంటా లేకుండా. లేపోతే పక్క జాగావాడు బటబెహరా మా కానివాడు. ఏదో ఓ తంటా తెచ్చిపెడ్తాడు" అన్నాడు ఫకీరు సాహూ.

"నాలుగు పక్కలా గోతులు తవ్వి పెద్ద కొయ్య రాటలు ఫాతమని పదబాబు కేలువాకి చెప్పారు కేలూ మూడు పక్కల రాటలు పాతి నాలుగో పక్క గొయ్య తీస్తున్నాడు.

"తొందరగా కానియ్యి కేలూ! రెండై పోయింది. మూడు గంటలకల్లా సబ్-రిజిష్ట్రారు ఆఫీసుకు వెళ్ళాలి. వై రోచను కూడా



అక్కడికి వస్తాడు. ఇవాళ ఎలాగైనా రిజిష్ట్రీ చేసేద్దాం. సాయంత్రం బస్సులో నేను భువనేశ్వరం వెళ్ళిపోతాను. పిల్లలు ఏం చేస్తున్నారో ఏమో! రిజిష్ట్రీ తర్వాత రసీదు కాయితాలూ అవీ నీకిస్తాను కాస్త వేగంగా పని పూర్తి చెయ్యి" వాచీ చూసి పదబాబు అన్నారు.

మూడు బారల లోతు గొయ్యి తవ్వి మన్ను పైకి తోడుతూ ఉంటే కేలూ చేతికి ఏదో గట్టిగా తగిలింది. గోతిని మరింత వెడల్పుచేసి వాడు లోపలికి చెయ్యిపెట్టి దాన్ని పైకి లాగేడు. ఓ పెద్దకోతి అస్థిపంజరం!! దాన్ని లాగ లాగి కేలూ మట్టి మీద పడేసేడు.

"అయ్యో అయ్యో" అంటూ పదబాబు వెనక్కి అడుగులువేస్తూ చెట్టు మొదట్లో కూలబడ్డారు. నెత్తిని చెయ్యిపెట్టుకుని కూచుండిపోయేరు. కాస్సేపటిదాకా ఆయన నోట మాటన్నది రాలేదు. కేలూ కొయ్యరాటని లోతుగా గట్టిగా పాతి చెరువులో చేతులూ కాళ్ళూ కడుక్కొని వచ్చేడు.

"పదండి బుగతగారూ పోదాం" అన్నాడు.

పదబాబు ఉలుకూ పలుకూ లేకుండా కూచున్నారు. కదల్లేదు మెదల్లేదు.

"మన పురోహితులు సనాతన మిశ్ర ఎక్కడికి వెళ్ళేరు? ఆయనోసారి పిలుచుకురా" కాస్సేపటికి ఆయన చెప్పేరు.

"సనాతన మిశ్రాని ఏం చేస్తారు ? రెండేళ్ళయింది ఆయన చచ్చి స్వర్గానికెళ్ళి!" అన్నాడు ఫకీరు సాహూ.

"ఏమిటీ. చచ్చిపోయారా? ఏమైంది?"

"అవడానికేముంది? ముసిలై పోయారు. బాధ పడ్డారు! ఒళ్ళు రోగాల పుట్టయింది. పోయారు."

"ముసిలై పోయారా? పదబాబు తుళ్ళిపడ్డారు. తను ఆయనతో పాటు కలిసి ఆడేడు పాడేడు. ముసిలెలా అయిపోయారూ? తనని తాను పదబాబు చూసుకున్నారు. అవును మరి. ఏభై ఎనిమిది ఏళ్ళు దాటి పోయాయి సనాతన మిశ్ర. తనకన్నా రెండేళ్ళో నాలుగేళ్ళో పెద్దవారై ఉందరా ఏం? కాని అరవై. అరవై దాటి బతకరా ఏం?

నలభై అయిదేళ్ళ క్రితం సంగతి పదబాబుకి జ్ఞాపకం వచ్చింది. ఓ రోజు తనూ సనాతనమిశ్ర ఇద్దరూ కలిసి కోతుల్ని వెంట బెట్టడం! ఆ రోజుల్లో సనాతనమిశ్ర తండ్రి పురోహితుడిగా ఉండేవారు. మిశ్ర. మిశ్రతో పాటు ఆయన నల్ల కుక్కబుల్లా కూడా ఆవేళ ఉంది.

చెరువు గట్టునే ఉన్న తోటలో తాంద్ర చెట్టు మీద రెండు కోతులు ఒహదాన్నొహటి కౌగలించుకుంటూ కిచకిచ లాడుతున్నాయి. ఓ రాయి తీసి గురి చూసి సనాతన మిశ్ర కొట్టేడు. అది వెళ్ళి ఓ కోతి చెంపకి తగిలింది. తనూ మరో బెడ్డ తీసి విసిరేడు. అది రెండో కోతి వీపుకెళ్ళి తగిలింది. రెండు కోతులూ ప్రాణభయంతో కిందకి గెంతి పారిపోబోయేయి. తటాలుమని బుల్లా ఓ కోతి పీకని కంద ఊడి వచ్చేటట్టు పట్టుకుంది. మిశ్రా తనూ కలిసి ఆ కోతిని ఈడ్చుకుంటూ వెళ్ళి చెరువు గట్టు మీద పడేసేరు. నోట్లో నీళ్ళు పోసేరు. అది మాత్రం బతకలేదు. ఇద్దరికిద్దరూ నేరం చేసినవాళ్ళలా దాన్ని లాక్కొనివెళ్ళి ఆ మధ్యాహ్నపువేళ తీక్షణమైన ఎండలో పొలానికి ఓ మూల గొయ్యితీసి పాతి పెట్టేరు. ఎవరికీ ఏం చెప్పకుండా ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళిపోయేరు.

కాస్త దూరం వెళ్ళి ఇద్దరి కిద్దరూ వెనక్కి తిరిగి చూసేరు. రెండోకోతి మామిడిచెట్టుమీద కూచుని కింద పాతిపెట్టిన జాగాని రెప్పవెయ్యకుండా చూస్తోంది. ఈ చెట్టుమీంచి ఆ చెట్టు మీదకి ఆ చెట్టు మీంచి ఈ చెట్టు మీదకి దూకుతోంది. అరుస్తోంది. సనాతనుడూ తనూ దొంగల్లా నెమ్మదిగా ఎవరిళ్ళకివాళ్ళు జారుకున్నారు.

పద్మ చరణబాబు మొహం నల్లగా మాడిపోయింది.

గతంలోని భయంకరమైన జ్ఞాపకం అస్థిపంజరంగా మట్టిలోంచి పైకి వచ్చి తనకెదురుగా నాలుగు కాళ్లూ పార జాపుకుని తనని చూసి చిరునవ్వులు నవ్వుతోంది. ఆయనేం మాట్లాడలేకపోయేరు.

"పదండి వెళ్దాం. ఆలస్యమైపోతోంది" అన్నారు ఫకీరు సాహు.

పదబాబు సందిగ్ధంలోపడి వాచీని పదేపదే చూసేరు.

"ఇవాళ్టికి ఇంకేం వద్దు. రెండు గంటలు దాటిపోయింది. నేనివాళ సాయంత్రం భువనేశ్వరం వెళ్ళిపోతున్నాను. మళ్లీ ఈసారి వచ్చినప్పుడు చూసుకుందాం" అన్నారు.

మజూరీ డబ్బు చెరో అయిదు రూపాయలూ అమీనుకీ కేలూకి ఇచ్చి. ఇంటికి అదే పోకగా వెళ్ళిపోయేరు.